‘రీవాల్యుయేషన్’కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఫార్మసీ కోర్సుల పరీక్షా ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఫార్మసీ (పీసీఐ) మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షల ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కుల మెమోలను సంబంధిత కళాశాలల నుంచి మూడు వారాల తర్వాత పొందవచ్చని చెప్పారు. ఈ రీవాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి ఈ నెల 29 లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ. 200 అపరాధ రుసుముతో వచ్చే నెల రెండవ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పరీక్ష జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్ కు రూ.1000 చొప్పున చెల్లించి ఈనెల 29 వరకు తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్లో చూసుకోవచ్చని సూచించారు.

ఎంబీఏ కోర్సుల తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్మెంట్ – ఈవినింగ్), ఎంబీఏ (ఈవినింగ్) కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 17 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్సైట్ లో చూసుకోవాలని సూచించారు.

బీఏ లాంగ్వేజెస్ పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఏ లాంగ్వేజెస్ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరిలో నిర్వహించిన కోర్సుల పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్సైట్ www. osmania. ac. in లో చూసుకోవాలని సూచించారు.

సర్క్యులర్ రద్దుకు కృషి చేయండి..

ఓయూ విద్యార్థి సంఘాల జేఏసీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్యమాలను నిషేధిస్తూ ఓయూ యంత్రాంగం జారీ చేసిన సర్క్యులర్ రద్దు కు కృషి చేయాలని ఓయూ విద్యార్థి సంఘాల జేఏసీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కు జేఏసీ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడు తూ.. ఓయూలో రాజ్యాంగ విరుద్ధంగా ఇచ్చిన సర్క్యులర్‌ను తక్షణమే రద్దు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చిన్న చిన్న అంశాలు సాకుగా చూపి మొత్తం విద్యార్థుల హక్కులను కాలరాసే విధంగా ఓయూ అడ్మినిస్ట్రేషన్ అధికారులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. విశ్వవిద్యాలయాలు భావ సంఘర్షణ కేంద్రాలని, విద్యార్థుల చైతన్యా న్ని నీరుగార్చే చర్యలకు పూనుకోవద్దని అన్నారు. విశ్వవిద్యాలయంలో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఆ సమస్యల పరిష్కారానికి విద్యార్థులు సహజంగానే పోరాటాలు చేస్తారని చెప్పారు. విద్యార్థుల అన్ని రకాల సమస్యలు పరిష్కరించి, మౌలిక వసతులు కల్పించడంలోలేని ఆసక్తి , ఉద్యమాలను నిషేధించడంలో ఉండటం ఆవేదన కలిగిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ అంశంలో జోక్యం చేసుకొని విద్యార్థుల రాజ్యాంగ హక్కులను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థి నేతగా శాసన మండలిలో ప్రాతినిధ్యం వహిస్తున్న వెంకట్ సర్క్యులర్ రద్దుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నేతలు నాగేశ్వరరావు, సుమంత్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి నాయకులు

2న వీఎస్టీ ఎంప్లాయిస్ కన్స్యూమర్ కో-ఆపరేటివ్ సొసైటీ వర్కర్స్ యూనియన్ ఎన్నికలు

వీఎస్టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి ప్యానల్ తరపునుంచి నామినేషన్లు దాఖలు చేస్తున్న సభ్యులు

చిక్కడపల్లి, మార్చి 25: వీఎస్టీ ఎంప్లాయిస్ కన్స్యూమర్ కో-ఆపరేటివ్ సొసైటీ వర్కర్స్ యూనియన్‌కు ఏప్రిల్ 2న ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం బాగ్ లింగంపల్లిలోని వీఎస్టీ యూనియన్ కార్యాలయంలోగల వీఎస్టీ కన్స్యూమర్ సొసైటీ కార్యాలయంలో సొసైటీ సభ్యుల నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల అధికారి కోఆపరేటివ్ శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శివకుమార్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమారులు నామినేషన్లు స్వీకరించారు. ఈ ఎన్నికల్లో వీఎస్టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు, మాజీ ఎంపీ సంజీవరెడ్డి ప్యానెల్ తరపున హబీబ్ షరీఫ్, ఎం.సత్యనారాయణ, జి.గౌరీ శంకర్, టి.పాల్సింగ్, పి.నవీన్ కుమార్, బి.రాహుల్, శ్యామ్ కుట్టి, అజయ్, అభిషేక్, రాజశేఖర్‌రెడ్డి, ఉమాకాంత్ రెడ్డిలు లు నామినేషన్లు దాఖలు చేశారు. అదేవిధంగా వీఎస్టీ వర్కర్స్ యూనియన్ మాజీ అధ్యక్షుడు, దివంగత నాయిని నర్సింహారెడ్డి (వీఎస్‌ఆర్) ప్యానల్ నుంచి అభిలాశ్, కె.శంకర్రావు, మహేశ్‌కుమార్, ప్రమోద్ రెడ్డి, ఎం. శ్రీకాంత్ రెడ్డి, కె.అమిత్ రావు. బి .నర్సింగ్‌రాజ్, టి ప్రదీప్ జాదవ్, వి.నవీన్, వేణులు నామినేషన్లు దాఖలు చేశారు. అదేవిధంగా బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్యానెల్ తరపున జి.సచిన్, కందుల మణికంఠరెడ్డి, ప్రణయ్‌కుమార్, బండ నవీన్, ఎం.కృష్ణారెడ్డిలు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి శివకుమార్ మాట్లాడుతూ.. ఈనెల 27న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ఉంటుందని తెలిపారు. ఈ సొసైటీకి 10మంది డైరెక్టర్ల ఎన్నికల కోసం ఏప్రిల్ 2న ఎన్నికలు వీఎస్టీ యూనియన్ కార్యాయలంలో జరుగుతాయని తెలిపారు. అదేరోజు సాయంత్రం ఎన్నికల ఫలితాలు వెలువడతాయని చెప్పారు. పది మంది డైరెక్టర్లలో ఒక ఎస్సీ రిజర్వ్‌డ్ డైరెక్టర్ పదవి ఉంటుందని, గెలుపొందిన పదిమంది డైరెక్టర్లు చైర్మన్‌ను ఎన్నుకుంటారని తెలిపారు. ఈ నామినేషన్ల దాఖలులో సంజీవరెడ్డి ప్యానెల్ కు చెందిన కార్మిక నాయకులు కె.రాజు, ఎల్డీపాల, జి.నాగేశ్, శ్రీనివాస్ యాదవ్‌తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆరు నెలలైనా ఆ ఫ్లెక్సీలు తొలగించడంలేదు ..

చిక్కడపల్లి, మార్చి 25: బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన చెందిన ఫ్లెక్సీలు రాత్రికి రాత్రే జీహెచ్‌ఎంసీ అధికారులు తొలగించి.. అదే కాం గ్రెస్, బీజేపీ, ఇతర పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు మాత్రం నెలల తరబడి ఉన్నా వాటిని పట్టించుకోవడంలేదని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. రాంనగర్ డివిజన్, బాగ్ లింగంపల్లిలోని జలమండలి కార్యాలయం ప్రధాన రోడ్డులో స్థానిక బీజేపీ కార్పొరేటర్ ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు ఆరు నెలలైనా తొలగించకపోవడంతో జీహెచ్‌ఎంసీ తీరుపై నాయకులు మండిపడుతున్నారు. కార్పొరేటర్ గత అక్టోబర్‌లో దసరా, దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు నేటికీ తొలగించలేదు. కాగా.. ఫిబ్రవరి 17న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఆ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను అదే నెల 16న రాత్రికి రాత్రే తొలగించారు. కేవలం బీఆర్‌ఎస్‌కు సంబంధించిన ఫ్లెక్సీలు తొలగించడం పట్ల వారు తీవ్రం గా నిరసన కూడా వ్యక్తం చేశారు. కానీ బీజేపీ కార్పొరేటర్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు మాత్రం తొలగించకపోవడంపై పలువురు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అన్ని పార్టీలకు నిబంధనలు ఒకే విధంగా ఉండాలని అన్నారు.

బాగ్‌లింగంపల్లి ప్రధాన రహదారిలో ఆరు నెలలు గడుస్తున్నా తొలగించని ఫ్లెక్సీ

టౌన్‌ప్లానింగ్ విభాగంలో అక్రమాలను అడ్డుకోవాలి

బేగంపేట, మార్చి 25 : జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగంలో అక్రమాలను అడ్డుకోవాలని బేగంపేటకు చెందిన దళిత చైతన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పిడి నవీన్‌కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నగర ముఖ్య ప్రణాళికాధికారి(సీసీపీ)ని కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం నవీన్ కుమార్ మాట్లాడుతూ .. జీహెచ్‌ఎంసీ పరిధిలో పనిచేస్తున్న చైన్మెన్లు స్థానచలనం లేకుండా ఏళ్ల తరబడి ఒకే ప్రాంతంలో పాతుకుపోయారని, అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ముఖ్యంగా బేగంపేట, సికింద్రాబాద్ సర్కిళ్ల పరిధిలో ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలే కనిపిస్తున్నాయని, ఇందుకు చైన్మెన్లు పెద్దమొత్తంలో ముడుపులు తీసుకుంటూ అక్రమ నిర్మాణాలకు ఊతమిస్తున్నారన్నారు. దీంతోపాటు జీహెచ్‌ఎంసీ పరిధిలో న్యాక్ ఇంజినీర్ల వ్యవస్థను కూడా పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు.

ఎన్‌పీఆర్‌డీ మహిళా విభాగం రాష్ట్ర కార్యవర్గం

చిక్కడపల్లి, మార్చి 25 : వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) మహిళా వికలాంగుల రాష్ట్ర సదస్సు మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. మహిళా విభాగం రాష్ట్ర కమిటీ 27మందితో ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యింది. కన్వీనర్‌గా సాయమ్మ , కో కన్వీనర్లుగా నాగలక్ష్మి, భాగ్యలక్ష్మి, కవిత, జయలక్ష్మి, సావిత్రి, షాయిన్ బేగం, కమిటీ సభ్యులుగా చంద్రమ్మ, మేరీ, నిరంజన్‌రెడ్డి, విజయలక్ష్మి, సంతోష్, నిర్మల, సత్యమ్మ, లక్ష్మి, మంగమ్మ, భాను, ప్రియాంక, అనసూయ, లక్ష్మి, శారదా, మౌనిక, మనోహర, పద్మ, ఉషా, దీపిక తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కన్వీనర్ సాయమ్మ మాట్లాడుతూ.. మహిళా దివ్యాంగులకు అవకాశాలు కల్పించాలని, ఇందిరా మహిళా శక్తి పథకంలో 5శాతం కేటాయించాలని అన్నారు. మహిళా దివాన్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమిస్తామని తెలిపారు.

ఇంటి వద్దకే రాములోరి తలంబ్రాలు

కాప్రా, మార్చి 25: శ్రీరామనవమి సందర్భంగా భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణ తలంబ్రాలు సులువుగా ఇంటి వద్దకే వచ్చే విధంగా ఆర్టీసీ తగిన ఏర్పాట్లు చేసింది. ఇందుకు సంబంధించి మంగళవారం కుషాయిగూడ ఆర్టీసీ డిపో ఆవరణలో సికింద్రాబాద్ రీజినల్ డిప్యూటీ ఆర్‌ఎం జి.పవిత్ర పోస్టర్ ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ భద్రాద్రి వెళ్లి కళ్యాణం చూడని వాళ్ళ కోసం ఆర్టీసీ ఆధ్వర్యంలో శ్రీరాముల వారి తలంబ్రాలను నేరుగా తమ ఇంటి వద్దకే పంపిస్తామన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని కోరారు. బుకింగ్ కోసం కుషాయిగూడ డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రమేశ్ సెల్‌నంబర్ 91542988 33, 9848852211ను సంప్రదించాలని సూచించారు.

126 మొబైల్స్ అందజేత

జీడిమెట్ల : సైబరాబాద్ బాలానగర్ జోన్ డీసీపీ పరిధిలో దొంగలించిన, పోగొట్టుకున్న 126 మంది బాధితుల ఫోన్లను 30 రోజుల్లో సాంకేతిక పరిజ్ఞానంతో రికవరీ చేసి రూ. 28 లక్షల విలువగల ఫోన్లను పోలీసులు చేజిక్కించుకున్నారు. మంగళవారం బాలానగర్ జోన్ డీసీపీ సురేశ్‌కుమార్ నేతృత్వంలో బాధితులకు సెల్ ఫోన్లను అందజేశారు. కార్యక్రమంలో ఆయా పోలీస్ స్టేషన్ల సీఐలు, డీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

అన్ని రూట్లలో బస్సులు నడిపేందుకు చర్యలు

మల్కాజిగిరి,మార్చి25: మల్కాజిగిరి నియోజకవర్గంలోని అన్ని రూట్లలో ఆర్టీసీబస్సులను నడపడానికి చర్యలు తీసుకుంటు న్నామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఆర్టీసీ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులు అన్ని రూట్లలో నడవకపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇదే విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి బస్ సౌకర్యంతో పాటు బస్‌షెల్టర్లను ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశానని తెలిపారు. మంత్రి ఆదేశాలతో ఆర్టీసీ అధికారులతో సమావేశం నిర్వహించి అన్ని రూట్లలో బస్సులను నడపడంతో పాటు బస్‌షెలర్లను నిర్మించాలని ఆదేశించామని అన్నారు. ఆర్టీసీ రీజనల్ మేనేజర్ పవిత్ర, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

బహుగళ గాయకుడు పేరి నాగేశ్వరరావు

విజయలక్ష్మి దంపతులను సత్కరిస్తున్న హరి శ్రీనివాస్, త్రినాథ్‌రావు

ముషీరాబాద్, మార్చి 25: బహుగళ గాయకుడు పేరి నాగేశ్వర్‌రావు అని ప్రముఖ రచయిత హరి శ్రీనివాస్ అన్నారు. ధృతి మ్యూజికల్ అకాడమీ, ఇషాన్ ఫౌండేషన్, విజయ క్రియేషన్స్ సాంస్కృతిక సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయగానసభలో సినీ సంగీత విభావరి నిర్వహించారు. పేరి నాగేశ్వర్ రావు, పేరి విజయలక్ష్మి నిర్వహణలో ఆలపించిన మధుర గీతాలు పలువురిని రంజింపచేశాయి. ముఖ్య అతిథిగా హాజరైన హరి శ్రీనివాస్‌మాట్లాడుతూ ..సంగీత పరంగా ఎందరో గాయకులకు తమ వేదికపై అవకాశాలు కల్పిస్తూ సామాజికపరంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పేరి దంపతులు ఆదర్శప్రాయులని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో భీమశంకరం, పేరి దేవి, కామేశ్వర రావు, స్వరకిన్నెర త్రినాథ్‌రావు పాల్గొన్నారు.

మసీదు బస్తీ మహిళ లకు ఇఫ్తార్ విందు..

రంజాన్‌ను పురస్కరించుకొని అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ శేషుకుమారి బీకేగూడ మసీదు బస్తీలో మహిళలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. సాధారణంగా జరిగే ఇఫ్తార్ విందులో మహిళల భాగస్వామ్యం ఉండదని, అందుకే బీకే గూడ మసీదు బస్తీలో ప్రత్యేకించి మహిళలకు ఇఫ్తార్ విందు ఇచ్చినట్లు శేషు కుమారి తెలిపారు. కార్యక్రమంలో మసీదు బస్తీ కమిటీ పెద్దలు మహమ్మద్ నసీరుద్దీన్ ఖాద్రీ, బస్తీ ప్రతినిధులు షేక్ అంజాద్, సయ్యద్ అతిక్, మహమ్మద్ జహీర్ పాషా, మహమ్మద్ అహ్మద్ షరీఫ్, మహమ్మద్ నిషారుద్దీన్ ఖాద్రీ, బీఆర్‌ఎస్ ప్రతినిధులు బాషా లక్ష్మి, శ్రీలక్ష్మి, నరసింహ, బలరాం, తదితరులు పాల్గొన్నారు.

– అమీర్‌పేట, మార్చి 25

సనత్‌నగర్ జెక్‌కాలనీలో మొక్కలు నాటిన పలువురు

సనత్‌నగర్ జెక్‌కాలనీ ఎన్‌వీఎస్‌ఎస్ నివాస్‌వారి సౌజన్యంతో కాలనీలోని విజేత సూపర్ మార్కెట్ సమీప ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. జెక్ కాలనీ నివాసితుల ఫెడరేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ మల్లు ప్రసాద్, డీఆర్‌ఎస్ చందు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ ప్రతినిధులు, ఎన్‌వీఎస్‌ఎస్ నివాస్ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేశ్‌చౌదరి, ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి , కోశాధికారి సంపత్, కాలనీ ప్రతినిధులు వెంకట్ సోమ, తదితరులు పాల్గొని పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. – అమీర్‌పేట, మార్చి 25

హుండీ లెక్కింపు...

మారేడ్ పల్లి, మార్చి 25 : రెజిమెంటల్ బజార్‌లోని శ్రీ కాశీ విశ్వనాథస్వామి ఆలయంలో హుండీ లెక్కింపు జరిగింది. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, ఆలయ ఈవో మహేందర్ గౌడ్ పర్యవేక్షణలో ఐదు నెలల హుండీని భక్తులు, ఆలయ సిబ్బంది, శ్రీనివాస సేవా సమితి ఆనంద్ బృందం సభ్యులు హుండీని లెక్కించారు. హుండీ ద్వారా ఆదాయం రూ.1,65,000 వచ్చినట్లు ఆలయ ఈవో మహేందర్ గౌడ్ వెల్లడించారు.

వెలుగని స్ట్రీట్ లైట్లు ..

చిక్కడపల్లి, మార్చి 25: గాంధీనగర్ డివిజన్, జవహర్‌నగర్ గీతాంజలి హైస్కూల్ లైన్‌లో గత 15 రోజులుగా విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వారు వాపోయారు. రాత్రి సమయంలో వీధి దీపాలు లేకపోవడంతో మహిళలు నడుచుకుంటూ వెళ్లడానికి భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని స్థానిక బీఆర్‌ఎస్ నాయకుడు ఎస్టీ ప్రేమ కోరారు.

గంజాయి విక్రేత అరెస్ట్

దుండిగల్, మార్చి 25: సూరారం పీఎస్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. జీడిమెట్ల బస్‌డిపో సమీపంలోని నల్లగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయం పరిసర ప్రాంతాల్లో ఓ వ్యక్తి గంజాయి అమ్ముతున్నట్లు సోమవారం రాత్రి పోలీసులకు సమాచారం అందింది. దీంతో పెట్రోలింగ్ డ్యూటీలో ఉన్న పోలీసులు అతడిని పట్టుకొని విచారించగా చింతల్‌లోని హెచ్‌ఎంటీ రోడ్, డ్రైవర్ శంభు ప్రవీణ్ కుమార్‌గా తేలింది. అతడి వద్ద నుంచి రూ.15 వేలు విలువ చేసే 260 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం అతడిని రిమాండ్‌కు తరలించారు.

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ముషీరాబాద్, మార్చి 25: హమాలీ కా ర్మికులకు సమగ్ర భద్రతతో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తెలంగాణ హమాలీ, మిల్ వర్కర్స్ యూనియన్, తెలంగాణ ప్రగతిశీల హమాలీ, మిల్ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్ల విలీన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడా రు. ప్రజావసరాల కోసం పనిచేస్తున్న హ మాలీ కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. సంక్షేమ బోర్డు లేకపోవడం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, దుర్భరమైన జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 50 సంవత్సరాలు దాటిన హమాలీ కార్మికులు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, హమాలీ కార్మికులందరికీ లేబర్ కార్డులు ఇ వ్వాలని డిమాండ్ చేశారు. 55 సంవత్సరా లు ఉన్న ప్రతి హమాలీ కార్మికుడికి రూ.5000 పెన్షన్ ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రతి హమాలీకి ప్రమాద బీమా కల్పించాలని, పని స్థలాల్లో క్షతగాత్రులైన కార్మికులకు పూర్తి వైద్య సౌకర్యం యాజమాన్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర అ ధ్యక్షుడు శివకుమార్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ, అనురాధ, హమాలీ యూనియన్ల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సారంగపాణి, శ్రీధర్, ఇంద్రసేనా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

సీబీఎస్‌ఈ సిలంబమ్ చాంప్ అభిరామ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: సైనిక్‌పురిలోని వీజే స్పోర్ట్స్ అకాడమీ వేదికగా జరిగిన సీబీఎస్‌ఈ స్కూల్ స్టేట్ సిలంబమ్ చాంపియన్‌షిప్‌లో అభిరామ్ విజేతగా నిలిచాడు. బాలుర అండర్-8 విభాగంలో ఆర్మీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన అభిరామ్ అగ్రస్థానం దక్కించుకోగా, నక్ష్, సక్రిధర వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. బాలుర మిగతా విభాగాల్లో అభయ్, మహీధర్, జితమన్యు, వికాస్ విజేతలుగా నిలిచారు. బాలికల వేర్వేరు విభాగాల్లో మహ్నవి, హితశ్వి, అక్షిత, తనుజా దినేశ్ పతకాలు సొంతం చేసుకున్నారు.

ఆర్టీసీ బస్సు కిందపడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతి

బొల్లారం, మార్చి 25: ఆర్టీసీ బస్సు డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యం కారణంగా బస్సు చక్రాల కింద పడి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతి చెందిన సంఘటన తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై అంతోనమ్మ తెలిపిన ప్రకారం.. అల్వాల్ వెంకటాపురం ఎంఈఎస్ కాలనీకి చెందిన త్రివేణి కుమారి(44) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. మంగళవారం ఉదయం 9:50 గంటలకు భర్త నిరంజన్ తమ ఇంటి వద్ద నుంచి లాల్ బజార్ సిగ్నల్ వద్ద కారులో డ్రాప్ చేసి వెళ్లిపోయాడు. త్రివేణి కుమారి సిగ్నల్ దాటి లాల్ బజార్ బస్ స్టాప్ వద్దకు చేరుకునే సమయంలో ఈసీఎల్ నుంచి లాల్ బజార్ వైపు వస్తున్న కంటోన్మెంట్ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ సిటీ బస్సు లాల్ బజార్ సిగ్నల్ వద్ద వేగంగా మలుపు తిప్పడంతో.. ఎడమవైపు నుంచి కారు రావడంతో త్రివేణి కుమారి రెండు వాహనాల మధ్య ఇరుక్కొని బస్సు చక్రాల కింద పడి మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. ఈ ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ నరేశ్, కారు డ్రైవర్ రమేశ్ పై భర్త నిరంజన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతురాలికి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న కుమారుడు ఉన్నట్లుగా పోలీసులు తెలిపారు.

వీరాచారిపై అవినీతి ఆరోపణలు..

ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలి

ఉద్యమకారుల అభివృద్ధి సంఘం అధ్యక్షుడు సంజీవ్

బొల్లారం, మార్చి 25: భద్రాద్రి– కొత్తగూడెం జిల్లా అశ్వాపురానికి చెందిన రాగి వీరాచారిపై వస్తున్న ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని తెలంగాణ పోలీస్ ఉద్యమకారుడు, ఉద్యమకారుల అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోర్గి సంజీవ్ డిమాండ్ చేశారు. మంగళవారం బోయిన్‌పల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు... గత కొద్ది రోజులుగా హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో గల హెబ్రోన్ చర్చిలో జరుగుతున్న పరిణామాలపై వీరాచారి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఇతనిపై రాష్ట్ర, జాతీయ స్థాయిలో 33 కేసులు ఉన్నాయని, అదేవిధంగా 8చెక్ బౌన్స్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, బ్రదర్ భక్తసింగ్ సొసైటీలో, అదేవిధంగా హెబ్రోన్ చర్చి సొసైటీలో ఎలాంటి సంబంధాలు లేకపోయినప్పటికీ వాటికి సంబంధించిన నిధులను కాజేస్తూ అందరిని భయభ్రాం తులకు గురి చేస్తున్నాడని అన్నారు. కిరాయి గూండాలు, రౌడీలతో చర్చిలో, భక్తసింగ్ సొసైటీలో బెదిరింపులకు పాల్పడుతున్నాడని తెలిపారు. భక్తులను ఇబ్బందులకు గురిచేస్తూ చర్చికి సంబంధించిన కోట్ల రూపాయలు దోచుకుంటున్నాడని ఆరోపించారు. సొసైటీలలో దోచుకుంటున్న కోట్ల రూపాయలతో అమాయక ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తున్నాడని, ఈ విషయమై ముఖ్యమంత్రి, డీజీపీలు స్పందించి అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బోర్గి సంజీవ్

వేర్వేరు చోట్ల నలుగురు అదృశ్యం

మల్కాజిగిరి, మార్చి 25: వేర్వేరు చోట్ల నలుగురు అదృశ్యమయ్యారు. మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై గణేశ్ బాబు కథనం ప్రకారం.. ఎస్పీనగర్‌లో నివసిస్తున్న మల్ల య్య (64) గత కొంత కాలంగా మానసిక వ్యాధికి చికిత్స పొందుతున్నాడు. 16న ఉద యం ఇంటి నుంచి బయటకు వెళ్లి సాయంత్రం ఇంటికి రాలేదు. కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మల్లయ్య (ఫైల్)

● నేరేడ్‌మెట్: నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సఫిల్‌గూడ పావని రెసిడెన్సీలో నివాసం ఉంటున్న కొత్తపేట అభిలాష్ (27) ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనోపాధిపొందుతున్నాడు. గత కొన్ని రోజుల క్రితం ఉద్యోగం పోయింది. దాంతో అభిలాష్ మనస్తాపం చెంది ఈనెల 24న ఇంటినుంచి బయటికి వెళ్లాడు. అంతటా వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభిలాష్ (ఫైల్)

● వినాయకనగర్ శ్రీకృపాల పార్ట్‌మెంట్‌లో మమత (22) నివాసం ఉం టుంది. గత కొన్నిరోజుల నుంచి భర్త తో గొడవలు జరుగుతున్నాయి. మనస్తాపం చెంది తల్లిదండ్రుల ఇంటికి వెళ్లింది. గతనెల 22న తల్లిదండ్రుల ఇంటినుంచి బయటికి వెళ్లింది. కుటుంబ సభ్యులు అంతటా వెతికినా ఆచూకీ లభించలేదు. కుంటంబ సభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు విచారిస్తామని తెలిపారు.

మమత (ఫైల్)

● జేజేనగర్‌లో నివాసం ఉంటున్నబి. వెంకటరావు (28) లేబర్‌గా చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత కొన్ని రోజులనుంచి భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో భర్త వెంకటరావు మనస్తాపం చెంది ఇంటినుంచి బయటికి వెళ్లాడు. కుటుంబ సభ్యులు అంతటా వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారిస్తామని చెప్పారు.